సాక్షి పెద్దపల్లి
శనివారం । 17 । జూన్ । 2023



వ్యవసాయ కోర్సులకు..

రాష్ట్రంలోని వ్యవసాయ, వెటర్నరీ, ఫిషరీస్, హార్టికల్చర్ వంటి కోర్సుల్లో చేరేందుకు అవసరమైన నోటిఫికేషన్‌ను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసింది. 8లో▸



పత్తి క్వింటాల్‌కు రూ.6,861

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో శుక్రవారం పత్తి క్వింటాల్ ధర రూ.6,861, కనిష్టం రూ.6,067, సరాసరి ధర రూ.6,555 నమోదైనట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
41.0/29.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు వడగాలులు వీచే అవకాశం ఉంటుంది. ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు 'ఖని'లో ఆటోలు బంద్

గోదావరిఖనిటౌన్(రామగుండం): రామగుండం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖనిలో ఆటోల బంద్‌కు పిలుపునిచ్చారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకొని కనీస చార్జీల పెంపుదలకు శుక్రవారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో నిర్ణయించారు. మినిమం చార్జీ రూ.15 నుంచి రూ.20, మజీద్ టర్నింగ్ నుంచి చౌరస్తా వరకు రూ.30– 40 పెంచడం జరిగిందని యూనియన్ బాధ్యులు పేర్కొన్నారు. మిగతా చార్జీలన్నీ యథాతథంగా ఉంటాయని తెలిపారు. 17న ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే ఆటోల బంద్ పిలుపునకు రామగుండం పరిధిలోని ఆటో యజమానులు, ప్రజలు, ఆటో కార్మికులందరూ సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి



బడిబాట ర్యాలీలో మంత్రి, తదితరులు

ధర్మారం(ధర్మపురి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తుందని, విద్యార్థులు ప్రైవేటుకు బదులుగా ప్రభుత్వ స్కూళ్లలో చేరాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలని కోరారు. సర్పంచు పుస్కూరి జితేందర్‌రావు, మండల విద్యాధికారి ఛాయాదేవి, ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి, గంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఈవో మాధవి

గోదావరిఖనిటౌన్(రామగుండం): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి డి.మాధవి సూచించారు. గోదావరిఖని గాంధీ పార్క్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం జరిగిన రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 30 వరకు బడిబాట కార్యక్రమాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో నూతన మెనూ పాటించాలని, త్వరలో రాగిజావ పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. విద్య దినోత్సవం సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం చేయాలని, ఉదయమే ప్రభాత భేరి నిర్వహించాలన్నారు. సమావేశంలో మండల విద్యాధికారి పి.సంపత్‌రావు, సెక్టోరియల్ అధికారి విజయకుమార్, మండల నోడల్ అధికారులు జింక మల్లేశం, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర స్వామి వసంతోత్సవం



ప్రత్యేక పూజల్లో ఈడీ సునీల్‌కుమార్ దంపతులు

జ్యోతినగర్(రామగుండం): ఉమామహేశ్వర స్వామి వసంతోత్సవం కన్నుల పండువగా జరిగింది. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని వైకుంఠపురం హరిహర ఆలయం ఆవరణలో ఉమామహేశ్వర స్వామి వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్–ఉషాకుమార్ దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ పూజారులు రాంపల్లి వామనశర్మ, రుద్రపట్ల శ్రీకాంత్‌శర్మ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాల్లో కార్పొరేటర్ కొలిపాక సుజాత, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పడకేసిన పర్యాటకం

మాటలకే పరిమితమైన మైసమ్మ గుట్ట ఎకోటూరిజం

- అమలుకు నోచుకోని ప్రతిపాదనలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఐతరాజ్‌పల్లి మైసమ్మ గుట్ట

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో పర్యాటకులకు కనువిందు చేసే ప్రదేశాలు చాలా ఉన్నాయి. చొరవ చూపితే పర్యాటక రంగాన్ని ప్రభుత్వం ఆదాయవనరుగా మార్చుకోవచ్చు. రాష్ట్రానికే తలమానికమైన రామగిరి ఖిల్లా, ధూళికట్ట బౌద్ధస్తూపం, పాండవులగుట్ట, సబ్బితం జలపాతం, రామునిగుండాలు వంటి చారిత్రాక స్థలాలున్నాయి. పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేస్తే పర్యాటకును ఆకర్షించవచ్చు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన నీతూ కుమారిప్రసాద్ సుల్తానాబాద్‌లోని ఐతరాజ్‌పల్లి మైసమ్మ గుట్టను క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. తదనంతరం అధికారుల పర్యవేక్షణ కరువై, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో కొత్త ప్రాజెక్టులు లేక పాతవి అభివృద్ధి చేయక జిల్లాలో పర్యాటకం పడకేసింది.

రూ.కోటి నిధులు..

హరితహారం, రూర్బన్ పథకం, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మైసమ్మ గుట్టపై ఎకో టూరిజం అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని గతంలో కలెక్టర్ నీతూకుమారిప్రసాద్ యోచించారు. తర్వాత కలెక్టర్‌గా వచ్చిన అలుగు వర్షిణి, స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి 2016లో గుట్టను పరిశీలించి మూడు దశల్లో అభివృద్ధి చేస్తామని ప్రకటించినా అమలుకు నోచుకోని పరిస్థితి. మైసమ్మ గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు విద్యుత్, వాటర్, వసతి గృహాలు, రహదారుల అభివృద్ధి, పార్కులు, పక్షులు, జంతు ప్రదర్శనశాలలు, ఇతర నిర్మాణాల కోసం రూ.75లక్షలు, హరితహారం, డీఎంఎఫ్‌టీ నిధులతో రోడ్లు తదితర పనులు అన్నీ కలిపి సుమారు కోటి రూపాయాలు వెచ్చించారు. తర్వాత వచ్చిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోవటంతో నిధులు వృథా అయ్యాయి.



గుట్టపై సగంలోనే నిలిచిపోయిన వాచ్‌టవర్ పనులు



గుట్టపైకి చేరుకునేందుకు వేసిన సీసీరోడ్డు

నామరూపాలు లేకుండా..

అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన రెండో విడుత హరితహారంలో సుల్తానాబాద్ పోలీసులు మైసమ్మగుట్టను దత్తత తీసుకొని 40వేల మొక్కలు నాటారు. అయితే పర్యవేక్షణ లేక ఆదరణ కరువై మొక్కలు ఎండిపోయాయి. అలాగే వాచ్‌టవర్ నిర్మించి వదిలివేయటంతో మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. దీనిపై డీఆర్‌డీవోను వివరణ కోరగా హరితహారంలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నామని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ అధికారుల వివరణ కోరగా.. కరోనా కారణంగా పనులు ఆగిపోయాయని, పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

అభివృద్ధి చేయాలి



మైసమ్మ గుట్టపై ఇప్పటికే పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. పర్యాటక కేంద్రంగా మారిస్తే చాలామంది గుట్టపై సేద తీరేందుకు ఆస్కారం ఉంటుంది. అంతేకాకుండా టూరిజంతో గ్రామంలో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు సైతం పెరిగే అవకాశం ఉంది. – మడ్డి సాయి, వార్డుసభ్యుడు, ఐతరాజుపల్లి

పర్యాటకం పేరుతో నిధులు వృథా

మైసమ్మ గుట్టను పర్యాటక కేంద్రంగా మారుస్తామని నిధులు కేటాయించి పనులు నామమాత్రంగా చేసి వదిలేశారు. ప్రభుత్వ నిధులు పూర్తిగా వృథా అయ్యాయి. జిల్లాలో మైసమ్మ గుట్టతో పాటు అనేక సందర్శనీయ ప్రాంతాలున్నాయి. వాటన్నింటినీ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి పరిస్తే బాగుంటుంది.

– సంతోష్‌రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి

పట్టణాల్లో ప్రగతికాంతులు



సుల్తానాబాద్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత



పెద్దపల్లిలో మెప్మా మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, బ్యాంకు అధికారులు



మంథనిలో బతుకమ్మతో చైర్ పర్సన్ శైలజ

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రగతి కాంతులతో పట్టణాలు కళకళలాడుతున్నాయని కలెక్టర్ డాక్టర్ సంగీత అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఉదయం రంగోలి పోటీలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ముత్యం సునీత జెండా ఆవిష్కరించారు. ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలతో మెప్మా, అంగన్‌వాడీ లు, ఆశవర్కర్లు తదితరులు ర్యాలీ నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పడక ముందు, తర్వాత జరిగిన అభివృద్ధికి మీరందరూ సజీవ సాక్ష్యమని, సీఎం కేసీఆర్ దార్శనికత్వంతో సుల్తానాబాద్ గ్రామ పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా మారిందన్నారు. చైర్‌పర్సన్ సునీత మాట్లాడుతూ, పట్టణ పరిధిలో సెగ్రిగేషన్‌షెడ్, క్రీడా ప్రాంగణాలు తదితర అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, వైస్ చైర్‌పర్సన్ సమత, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీఓ శశికళ, ఏఎంసీ చైర్మన్ మానిక ఎంపీపీ బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

సుందర పెద్దపల్లిగా తీర్చిదిద్దుదాం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనులు పురోగతిలో ఉన్నాయని, జిల్లా కేంద్రంగా అవతరించడంతో 8 ప్రధాన కూడళ్లను ఆధునీకరించే పనులు చేపట్టామని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పట్టణ ప్రగతిలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, మెప్మా మహిళలు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి రూపురేఖలు మారుస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పెద్దపల్లిలో ప్రగతి పనులు పురోగతిలో ఉన్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అన్నారు. ప్రజలకు అవసరమైన కనీసవసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. పట్టణంలోని 12 మహిళా సంఘాలకు చెక్కులు అందించారు. మార్కెట్‌కమిటీ చైర్మన్ జడల సురేందర్, కమిషనర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంథని మార్పును గమనించండి

మంథని: మంథనిని గత పాలకులు పట్టించుకోలేదని, గ్రామ సర్పంచ్ మొదలు నేడు మున్సిపల్ చైర్ పర్సన్‌గా పనిచేస్తున్న పుట్ట శైలజ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా వేస్తున్న అడుగులు మంచి ఫలితాలను తీసుకొచ్చాయని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. శుక్రవారం మంథనిలోని గాంధీచౌక్‌లో ఏర్పాటు చేసిన పట్టణప్రగతి దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మాట్లాడారు. మురుగు నీటితో ఇబ్బంది పడ్డ అంబేడ్కర్‌వాసుల కష్టాలు తీర్చిన చరిత్ర తమదన్నారు. గాంధీ మార్గమని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు మంథని నడిబొడ్డున గాంధీ విగ్రహం శిథిలమైతే పట్టించుకోలేదన్నారు. వ్యాపారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేశామని వెల్లడించారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌పై అదనంగా గదులు నిర్మిస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ శైలజ జండా ఆవిష్కరించారు. బొక్కలవాగు నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. బతుకమ్మ, కోలాటాలతో మహిళలు సందడి చేశారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ సంగీత

జ్యోతినగర్(రామగుండం): అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటరు జాబితా రూపొందించేందుకు చేపట్టిన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సంగీత, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఆడిటోరియంలో బూత్ లెవల్ అధికారులు, ఆర్పీలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదుతో పాటు సవరణ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అప్‌లోడ్ చేయాలన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, పెండ్లి చేసుకుని అత్తవారింటికి వెళ్లిన యువతులు, 18 ఏళ్ల దాటిన యువతను గుర్తించి జాబితాలో పేర్లను నమోదు చేయడానికి కృషి చేయాలన్నారు. ఓటరు నమోదుపై నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ జాహెద్ పాషా, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన



పరిశీలిస్తున్న డీసీపీ వైభవ్ గైక్వాడ్

కోల్‌సిటీ(రామగుండం): ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు తుదిరాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ ప్రతాల పరిశీలన కొనసాగుతోంది. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఈ ప్రక్రియను డీఐజీ రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్ ఉల్ హాక్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ వెరిఫికేషన్ ప్రక్రియ పరిశీలించి, అభ్యర్థులతో మాట్లాడారు. రెండో రోజు 651 అభ్యర్థులకు 568 మంది హాజరయ్యారు. వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా వెరిఫికేషన్ లెటర్ సంబంధిత ధ్రువపత్రాల ఒరిజినల్స్, ఒక జిరాక్స్ సెట్‌తో కేటాయించిన రోజు రావాలని డీసీపీ సూచించారు. ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్‌ఐలు మధుకర్, శ్రీధర్, ఏవో నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు పడ్డాయి!

- ఉమ్మడి జిల్లాకు రూ.1890 కోట్లు విడుదల
- శుక్రవారం ఒక్కరోజే రూ.700 కోట్లు
- 20వ తేదీ నాటికి మొత్తం ప్రక్రియ పూర్తి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎప్పుడెప్పుడా అని రైతులంతా ఆశగా ఎదురుచూస్తున్న ధాన్యం డబ్బులు ఖాతాల్లో పడ్డాయి. శుక్రవారం పౌరసరఫరాల శాఖ రాష్ట్రవ్యాప్తంగా రూ.3 వేల కోట్లు విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాకు రూ.700 కోట్లు ఇచ్చింది. ఈసారి అకాల వర్షాలు, వడగళ్ల వానలతో అతలాకుతలమైన రైతు దిగుబడి తగ్గి తల్లడిల్లిపోయాడు. అనంతరం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేందుకు వరుణదేవుడు ముప్పతిప్పలు పెట్టాడు. ఇవి చాలవన్నట్లుగా కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్లు, నిర్వాహకులు రైతులను తాలు, తేమ పేరుతో క్వింటాలుకు 9 నుంచి 11 కిలోలు తరుగు పేరిట వేధించారు.

ఇప్పటివరకు రూ.1890 కోట్లు...

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటి నుంచి పౌరసరఫరాలశాఖ కొనుగోలు ప్రక్రియను చేపట్టింది. మధ్యలో అకాల వర్షాలు, వడగండ్లు ఇబ్బంది పెట్టినా.. రైతులకు సమయానికి డబ్బులు ఇవ్వాలన్న లక్ష్యంతో ఎప్పటికపుడు ఖాతాల్లో డబ్బులు జమచేసింది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాకు రూ.1890 కోట్లు విడుదల చేసింది. కరీంనగర్‌లో 59,186 మంది రైతుల వద్ద మూడుల క్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి రూ.510 కోట్లు చెల్లించింది. జగిత్యాలలో 60,000 మంది నుంచి 41.4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.600 కోట్లు ఇచ్చింది. సిరిసిల్లలో 2.45 లక్షల మంది నుంచి 2.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొని రూ.330 కోట్లు జమ చేసింది. పెద్దపల్లి జిల్లాలో 47,584 మంది రైతుల వద్ద 3.39 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.450 కోట్లు రైతులకు అందజేసింది. ఉమ్మడి జిల్లా ఆంధ్రప్రదేశ్ కొనసాగుతున్నప్పటి నుంచే వరి సాగులో మేటిగా ఉండేది. తెలంగాణ వచ్చాక సాగు విస్తీర్ణం, ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో తన రికార్డులను తానే తిరగరాస్తోంది.

జిల్లా	శుక్రవారం	ఇప్పటివరకు	లక్ష్యం
కరీంనగర్	రూ.210 కోట్లు	రూ.510 కోట్లు	రూ.600 కోట్లు
జగిత్యాల	రూ.250 కోట్లు	రూ.600 కోట్లు	రూ.853 కోట్లు
సిరిసిల్ల	రూ.50 కోట్లు	రూ.330 కోట్లు	రూ.511 కోట్లు
పెద్దపల్లి	రూ.190 కోట్లు	రూ.450 కోట్లు	రూ.694 కోట్లు
మొత్తం	రూ.700 కోట్లు	రూ.1890 కోట్లు	రూ.2,658 కోట్లు

ఆదివారంతో కొనుగోళ్లు ముగుస్తాయి



రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ ప్రక్రియ ఆదివారానికి పూర్తవుతుంది. ఆదివారంతో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిచేసి, 20వ తేదీనాటికి డబ్బులు రైతుల ఖాతాల్లో వేసేలా చర్యలు చేపట్టాం. సీఎం ప్రవేశపెట్టిన 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుల వద్ద చెంతనే కొనుగోలు కేంద్రాలు వంటి రైతు అనుకూల విధానాలతో రాష్ట్రంలో దిగుబడి గణనీయంగా పెరిగింది.

– గంగుల కమలాకర్, పౌరసరఫరాల మంత్రి

కాళేశ్వరంతో పెరిగిన దిగుబడి



రాష్ట్రంలో వరి కొనుగోలు ప్రక్రియ దాదాపుగా పూర్తయ్యింది. రెండురోజుల్లో మొత్తం కొనుగోళ్లు, డబ్బుల జమ ప్రక్రియ కూడా ముగుస్తుంది. సీఎం రైతు పక్షపాతి. కాళేశ్వరం జలాలతోనే రాష్ట్రంలో పంట దిగుబడి అనూహ్యంగా పెరిగింది. ఎంత పంట వచ్చినా కొనుగోలుకు వెనకాడవద్దని సీఎం చెప్పారు. – సర్దార్ రవీందర్‌సింగ్, చైర్మన్, పౌరసరఫరాల శాఖ

మిగిలింది మూడు రోజులే

- రూ.లక్ష సహాయానికి వెల్లువలా దరఖాస్తులు
- సర్వర్ డౌన్‌తో కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణ

సుల్తానాబాద్(పెద్దపల్లి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ చేతి వృత్తులదారులను ఆదుకునేందుకు ప్రకటించిన రూ.లక్ష సహాయం సర్టిఫికెట్లకు ముడిపెట్టడంతో ఆశావహులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. దరఖాస్తుదారులు గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్థికభారంతో పాటు సమయం వృథా కావడం, పని చేసుకునేవారు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు

జిల్లాలో 14 తహసీల్దార్ కార్యాలయాలు ఉన్నాయి. రూ.లక్ష సాయానికి కులం సర్టిఫికెట్‌కు తహసీల్దార్ డిజిటల్ సంతకంతో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఆదాయం సర్టిఫికెట్ మాత్రం నాయబ్ తహసీల్దార్ జారీ చేస్తారు. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా కులం, ఆదాయానికి సంబంధించి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా రోజూ దరఖాస్తులు వేలల్లో మీసేవ కేంద్రాల నుంచి తహసీల్దార్ కార్యాలయాలకు వస్తున్నట్లు జిల్లా మీసేవ అధికారి తెలిపారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలతోపాటు గోదావరిఖని కార్పొరేషన్, 266 గ్రామపంచాయతీల పరిధిలో 134 మీసేవ కేంద్రాలున్నాయి. మీసేవ నుంచి తహసీల్ కార్యాలయానికి ఆన్‌లైన్, అప్‌లోడ్ బాగానే అవుతున్నాయని, డౌన్‌లోడ్ కావడానికి ఇబ్బందులు వస్తున్నట్లు జిల్లా మీసేవ అధికారి పేర్కొన్నారు. సుల్తానాబాద్ తహసీల్ కార్యాలయంలోనే రోజుకు 600 చొప్పున దరఖాస్తులు వస్తున్నాయంటే జిల్లా మొత్తం మీద పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

నిరీక్షణ

సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో దరఖాస్తుదారులు రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. ఒక్కోసారి నెమ్మదిగా, కొన్నిసార్లు మొత్తానికే పనిచేయడం లేదు. ఐదారు రోజులుగా ఇదే పరిస్థితి. మీ సేవ కేంద్రం నుంచి కులం, ఆదాయ దరఖాస్తు ఫారాలు నేరుగా తహసీల్ కార్యాలయాలకు వస్తాయి. వాటిని ఆన్‌లైన్‌లో పరిశీలించి తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు జారీ చేస్తారు. సర్వర్ సమస్యతో ప్రక్రియ సక్రమంగా కొనసాగడం లేదు.

పాతవి చెల్లుబాటు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తహసీల్దార్ కార్యాలయం నుంచి పొందిన కుల ధ్రువీకరణ పత్రం ఉంటే దరఖాస్తుకు ఎలాంటి ఇబ్బంది లేదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ చాలా మంది విషయం తెలియక కొత్తదాని కోసం ఎదురుచూస్తున్నారు. 2021 ఏప్రిల్‌లో జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం ఉన్నా సరిపోతుంది. ఇంటర్వ్యూ సమయంలో కొత్తవి సమర్పించాల్సి ఉంటుంది.

20వ తేదీ తుది గడువు

రూ.లక్ష సహాయం కోసం ఈ నెల 20 వరకు గడువు ఉంది. చివరి తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో కావల్సిన పత్రాలు జారీ కాక పోవడంతో బాధితులు ఇబ్బందిపడాల్సి వస్తోంది. ఈ నెల 9న దరఖాస్తు చేస్తే ఇప్పటికీ సర్టిఫికెట్ జారీ కాలేదని, రోజూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని నగరానికి చెందిన రాజు అనే యువకుడు వాపోయాడు.



సుల్తానాబాద్‌లో మీసేవ వద్ద దరఖాస్తుదారులు

రోజూ తిరుగుతున్నా..



సర్టిఫికెట్ల కోసం ఐదు రోజుల క్రితం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేశా. అదే రోజు మీసేవ నిర్వాహకులు తహసీల్ కార్యాలయానికి దరఖాస్తు పంపించారు. రోజూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సర్టిఫికెట్లు చేతికి అందలేదు. దరఖాస్తు గడువు దగ్గరపడుతుంది. అధికారులు చొరవ తీసుకొని తొందరగా సరిఫికెట్లు ఇవ్వాలి. – ఎస్.శ్రీనివాస్, వడ్రంగి, కాట్నపల్లి

సర్వర్ సమస్య ఉంది

మీ సేవ సర్వర్ సమస్యతో సకాలంలో ధ్రువపత్రాలు జారీ చేయలేకపోతున్నాం. సర్వర్ పని చేసే సమయంలో వెంటనే జారీ చేస్తున్నాం. ఎక్కడా ఆలస్యం చేయడం లేదు.

– కవిత, జిల్లా మీసేవ అధికారి

క్లుప్తంగా

'ఖని' కవికి జాతీయస్థాయి బహుమతి



జాతీయస్థాయి బహుమతి అందుకుంటున్న రాకుమార

కోల్‌సిటీ: గోదావరిఖని దుర్గానగర్‌కు చెందిన ప్రముఖ కవి రాకుమార గురువారం రాత్రి హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు రమణాచారి చేతుల మీదుగా జాతీయ స్థాయి బహుమతి అందుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సాహతీకిరణం సంస్థ వార్షికోత్సవం సందర్భంగా, గత నెలలో జాతీయ స్థాయి కవితల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాకుమార రాసిన 'ధాత్రి వేదన' అనే కవితను పంపించగా, ఉత్తమ కవిగా ఎంపికచేశారు. ఈమేరకు గురువారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో రాకుమారను ఘనంగా సన్మానించి బహుమతి అందించారు. రాకుమారను జిల్లా సాహితీవేత్తలు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

పే స్కేల్ అమలు చేయాలి

జ్యోతినగర్(రామగుండం): ఉపాధిహామీ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలని ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బొంగాని వెంకటేశ్‌గౌడ్ శుక్రవారం ప్రకటనలో కోరారు. ఉపాధి హామీ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో 3,874 మంది కొనసాగుతున్నారని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల సీఎం కేసీఆర్, పురపాలక శాఖ ఐటీ మంత్రి కేటీఆర్‌కు వినతి పత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. సీఎం కేసీఆర్ చొరవ తీసుకొని తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు 95శాతం విద్యార్థుల హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని ఇంటర్ నోడల్ అధికారి కల్పన తెలిపారు. శుక్రవారం జరిగిన ఫస్టియర్ పరీక్షలకు 94.30 శాతం సెకండియర్ పరీక్షలకు 95.80 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.

క్రిమిసంహారక మందు తాగి యువతి ఆత్మహత్య



పూజిత మృతదేహం

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన ఆలకుంట పూజిత (21) యువతి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు, ఎస్సై రాజేశ్ కథనం ప్రకారం.. ఆలకుంట శివయ్య–భార్య పద్మ పదేళ్లక్రితం కుటుంబంతో కలిసి సుందరగిరికి వచ్చాడు. ఇక్కడే వ్యవసాయబావులు తవ్వుతూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో పూజిత శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. ఈక్రమంలో తలనొప్పిగా ఉందని, చెమటలు పడుతున్నాయని కుటుంబ సభ్యులకు తెలపడంతో హుస్నాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సాయంత్రం పూజిత మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కాగా పూజితకు కొన్నిరోజులుగా కడుపునొప్పి ఉండేదని, పెళ్లి కావడంలేదనే బెంగతో మనస్తాపంచెంది ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి శివయ్య ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలి పారు.

వ్యవసాయ కోర్సులకు నోటిఫికేషన్

- జూలై 15 వరకు గడువు

జగిత్యాలఅగ్రికల్చర్: రాష్ట్రంలోని వ్యవసాయ, వెటర్నరీ, ఫిషరీష్, హార్టికల్చర్ వంటి కోర్సుల్లో చేరేందుకు అవసరమైన నోటిఫికేషన్‌ను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసింది. బైపీసీ ఉత్తీర్ణులై, తెలంగాణ ఎంసెట్–2023(మెడికల్ అండ్ అగ్రికల్చర్)లో సాధించిన ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. వెటర్నరీ సైన్స్ కోర్సు వ్యవధి ఐదున్నర ఏళ్లు కాగా, మిగతా కోర్సుల వ్యవధి నాలుగేళ్లు.

సీట్ల వివరాలు..

- హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, జగిత్యాల జిల్లా పొలాస, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, నాగర్ కర్నూల్ జిల్లా పాలెం, వరంగల్ అర్బన్ జిల్లా, రాజన్న సిరిసిల్ల, ఆదిలాబాద్ జిల్లాల్లో ఏడు అగ్రికల్చర్ కళాశాలలు ఉన్నాయి.
- ఇందులో 520 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా 200 సెల్ఫ్ ఫైనాన్స్(పేమెంట్) సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- బీఎస్సీ(వెటర్నరీ) కళాశాలలు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, వరంగల్ అర్బన్ జిల్లా మామునూరులో ఉన్నాయి. వీటిలో 174 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- బీఎఫ్ఎస్సీ(ఫిషరీష్) కళాశాలలు : వనపర్తి జిల్లా పెబ్బేరులో 28 సీట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా ముత్తుకూర్‌లో తెలంగాణ విద్యార్థులకు 11 సీట్లు కేటాయించారు.
- బీఎస్సీ(హార్టికల్చర్) కళాశాలలు : హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, వనపర్తి జిల్లా మోజర్లలో ఉండగా, ఇందులో 170 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా 34 పేమెంట్ సీట్లను కేటాయించారు.
- బీఎస్సీ(కమ్యూనిటీ సైన్స్) కళాశాల: హైదరాబా ద్‌లోని సైఫాబాద్‌లో ఉండగా, 38 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా 5 పేమెంట్ సీట్లు ఉన్నాయి. అన్ని కోర్సుల్లో పేమెంట్ సీట్లను ప్రత్యేక కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారు.



పొలాసలోని వ్యవసాయ కళాశాల

జూలై 15 వరకు గడువు..

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఫీజు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.1,800, ఎస్సీ, ఎస్టీలు రూ.900 చెల్లించాలి. సీటు లభిస్తే.. వ్యవసాయ, కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు రూ.45,550, వెటర్నరీ కోర్సులకు రూ.57,500, ఫిషరీష్ కోర్సులకు రూ.43,740, హార్టికల్చర్ కోర్సులకు రూ.50,425 ట్యూషన్ ఫీజు చెల్లించాలి. అగ్రికల్చర్ కోర్సుల్లో పేమెంట్ సీట్లకు రూ.10 లక్షలు, హార్టికల్చర్ కోర్సుల్లో పేమెంట్ సీట్లకు రూ.9 లక్షలు చెల్లించాలి. ఎంసెట్–2023 ర్యాంకుల ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. దరఖాస్తు ఫీజు చెల్లించేందుకు జూలై 15వ తేదీ వరకు గడువు ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు దఖాలు చేసేందుకు జూలై 17వ తేదీ వరకు గడువు విధించారు.

అర్హతలివే..

- 2023 డిసెంబర్ 31 నాటికి జనరల్ అభ్యర్థుల వయస్సు 17 ఏళ్లు పూర్తయి, 22 ఏళ్లు దాటి ఉండకూడదు.
- ఎస్సీ, ఎస్టీలకు 25 ఏళ్లు, పీహెచ్‌లకు 27 ఏళ్ల వరకు అనుమతి ఉంటుంది.
- ఒక వెటర్నరీ కోర్సుకు జనరల్ అభ్యర్థులు 17–25 ఏళ్ల మధ్య, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులు 30 ఏళ్ల వరకు ఉండవచ్చు.
- ఎకరం వ్యవసాయ భూమి ఉన్న రైతుల పిల్లలకు వెటర్నరీ కళాశాలల్లో 25 శాతం, అగ్రికల్చర్, హార్టికల్చర్ కోర్సుల్లో 40 శాతం సీట్లు రిజర్వ్ చేశారు.
- అయితే, ఆ భూమి విద్యార్థి పేరిట లేదా తల్లితండ్రుల పేరిట పట్టా ఉండాలి.
- ఇంటర్ వరకు కనీసం నాలుగేళ్ల పాటు నాన్ మున్సిపల్ ఏరియా(గ్రామీణ ప్రాంతం)లో చదివి ఉండాలి.
- బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 40 శాతం సీట్లు రిజర్వ్ చేశారు.
- పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీజేటీఎస్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను లాగిన్ కావాలి.

'వడ్ల పైసలు ఎందుకియ్యరు?'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: అరిగోస పడి రైతులు పండించిన వడ్లు కొని నెలలు గడుస్తున్నా పైసలు రైతుల ఖాతాలో ఎందుకు వేయడం లేదని ప్రజాహిత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, సి.సత్యనారాయణరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో శనివారం పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద మధ్యాహ్నం 12గంటల సాయంత్రం 7గంటల వరకు దీక్ష చేపట్టనున్నట్లు శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఓదెల జెడ్పీటీసీ గంట రాములు, మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తి, నాయకులు హాజీ, రఫీతో కలిసి మాట్లాడారు. రైతన్న అండగా నిలవాల్సిన పాలకులు, మిల్లర్లు, కేంద్రాల నిర్వాహకులు కోతల పేరిట లూటీ చేశారని ఆరోపించారు. తడిసిన ధాన్యం చివరిగింజ వరకు కొంటామని మంత్రులు, ఎమ్మెల్యే, చైర్మన్‌లు ప్రకటనలు ఇచ్చారే తప్ప ఎక్కడా కొనలేదని ఆరోపించారు. జిల్లాలో రూ.543కోట్ల విలువ చేసే ధాన్యం కొని ఇప్పటివరకు రూ.256 కోట్లు మాత్రమే చెల్లించారని పేర్కొన్నారు. దీక్షకు రాజకీయపార్టీల నాయకులు, రైతులు తరలిరావాలని కోరారు.

బొగ్గుబాయి వార్తలు

సింగరేణి కార్మికులకు కొండంత అండ సీఎం కేసీఆర్

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- 7ఎల్ఈపీ ఘటనలో మృతిచెందిన వారికి నివాళి

గోదావరిఖని: సింగరేణి గని కార్మికులకు కొండంత అండ సీఎం కేసీఆర్ అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం దశాబ్ది ఉత్సవాలు, రామగుండం దశాబ్ది ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆర్జీ–1 ఏరియా వర్క్‌షాప్ గేట్ మీటింగ్‌లో పాల్గొని ముందుగా తెలంగాణ అమరవీరులకు, 7ఎల్ఈపీ గని ప్రమాద మృతులకు నివాళులర్పించి మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం గని ప్రమాదంలో 17 మంది కార్మికులు మృతిచెందడం బాధాకరమని సింగరేణి యాజమాన్యం భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మహిళా ఉద్యోగులు టీబీజీకేఎస్ యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి స్వాగతించారు. ఏరియా వర్క్‌షాప్ పిట్ సెక్రటరి చెలకలపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో గంద్ర దామోదర్ రావు, జనగామ మల్లేశ్, కర్రావుల మహేశ్, లక్ష్మీకాంతరావు, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, నాయకులు ఐలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు నా కుటుంబ సభ్యులే

ఆటో డ్రైవర్లు నా కుటుంబసభ్యులేనని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గురువారం రాత్రి మార్కండేయ కాలనీ లక్ష్మిఫంక్షన్ హాలులో రామగుండం కార్పొరేషన్ ఏరియా ఆటోయూనియన్ సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆటోడ్రైవర్లందరికీ డ్రెస్‌కోడ్ ఇస్తామని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. నాయకులు తానిపర్తి గోపాల్ రావు, గోపు ఐలయ్య యాదవ్ వెంట ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే చందర్ అన్నారు. 26వ డివిజన్‌లోని పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరడంతో వారికి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు రఫీక్, నాయకులు అమరేందర్ రావు ఉన్నారు.



పుష్పగుచ్ఛం అందుకుంటున్న ఎమ్మెల్యే చందర్



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే చందర్



నివాళి అర్పిస్తున్న గని కార్మికులు

7ఎల్‌పీ గని ప్రమాద మృతులకు నివాళి

7ఎల్‌పీ గని ప్రమాద మృతులకు పలు సంఘాల నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం గని ఆవరణలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ పాల్గొని గని ప్రమాద మృతుల స్తూపం వద్ద నివాళులర్పించారు. 2003 జూన్ 16న సింగరేణి చరిత్రలోనే అత్యంత ఘోర ప్రమాదంలో 17మంది కార్మికులు మృతిచెందారని గుర్తుచేశారు. ఇందుకు సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యమే ప్రధాన కారణమని హైకోర్టు చీఫ్ జస్టిస్ విచారణలో తెలిందని అప్పటి ప్రభుత్వం సింగరేణి యాజమాన్య బాధిత కార్మిక కుటుంబాలకు ఇచ్చిన కొన్ని హామీలు మాత్రమే నెరవేర్చి తర్వాత వారిని పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. యూనియన్ల సలహాలు విస్మరించకూడదని, ఒంటెద్దు పోకడలకు పోయి కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని హెచ్చరిస్తూ అసువులు బాసిన గని కార్మికులకు నివాళులర్పించారు. సదానందం, సెంట్రల్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ధర్మపురి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా పక్షోత్సవాలు



జీఎం కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గోదావరిఖని/కమాన్‌పూర్: కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛత పక్షోత్సవాలు–2023 అనే నినాదంతో ఈనెల 16 నుంచి 30 వరకు సింగరేణిలో స్వచ్ఛత పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని జీఎం మనోహర్ అన్నారు. ఈ సందర్భంగా ఆర్జీ1, ఆర్జీ2,ఆర్జీ3 కార్యాలయాల వద్ద స్వచ్ఛతకు సంబంధించిన అంశాలపై శుక్రవారం ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, బట్టసంచులు వాడాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలని ఆదేశించారు. సింగరేణి కార్మికులు, అధికారులు నివసించే క్వార్టర్ల పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని ఏపీఏ జీఎం ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్జీ–3 జీఎం కార్యాలయం వద్ద అధికారులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛతపై అవగాహన, మైన్స్, డిపార్ట్‌మెంట్స్, స్కూల్స్, కార్యాలయాలు, కాలనీలు, డిస్పెన్సరీలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్కూల్ పిల్లలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, ప్లాస్టిక్ వాడకంపై అవగాహన, హరితహారంలో మొక్కలు నాటడం తదితర కార్యక్రమాల ద్వారా స్వచ్ఛతా పక్వాడాలో మన ప్రాంతాన్ని ముందు వరుసలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, డీజీఎం (పర్సనెల్) అధికార ప్రతినిధి రాజేంద్ర ప్రసాద్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారులు నరేందర్, సీతారామం, రఘుపతి, శ్రీనివాసులు, వెంకటరమణ, జైనులాబద్దీన్, విలాస్ శ్రీనివాస్ పొద్దార్, పద్మరాజు, సుధాకర్, ఐలయ్య, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న సింగరేణి అధికారులు

అభివృద్ధిలో రామగుండం ముందడుగు

కోల్‌సిటీ(రామగుండం): పట్టణ ప్రగతి కార్యక్రమంతో రామగుండం నగరం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖని దుర్గానగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రగతి దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు సింగరేణి స్టేడియంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ వాహనాలతో ర్యాలీగా రమేష్ నగర్, ప్రధాన చౌరస్తాగుండా ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జెండా ఆవిష్కరించారు. నగరపాలక సంస్థ ముద్రించిన ప్రగతి నివేదిక బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. టీఎస్‌బీపాస్‌పై అవగాహన కల్పించడంతోపాటు 75 గజాలలోపు భవన నిర్మాణానికి ఒక్క రూపాయి రుసముతో అనుమతి పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్లు, యూనిఫాం అందజేశారు. తొమ్మిదేళ్ల కాలంలో సుమారు రూ.600 కోట్ల విలువైన అభివృద్ధి పనులు రామగుండం నగరంలో చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే వివరించారు. జిల్లా కేంద్రం కాకున్నా రామగుండంకు సీఎం కేసీఆర్ వైద్య కళాశాల మంజూరు చేశారన్నారు. మేయర్ బంగి అనిల్‌కుమార్ మాట్లాడుతూ, నగరంలో రూ.45 కోట్లతో సుమారు 200 వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్పొరేటర్లు, ఎల్‌డీఎం, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చందర్, మేయర్ అనిల్‌కుమార్ తదితరులు

సింగరేణి ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్



సమావేశానికి హాజరైన అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ ఎలక్ట్రికల్, మరమ్మతులు సబ్‌స్టేషన్లకు సంబంధించిన విషయాలపై సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్)ఎన్వీకే. శ్రీనివాస్, డైరెక్టర్ ఈఅండ్‌ఎండీ. సత్యనారాయణరావు, డైరెక్టర్ (పీపీ) జి.వెంకటేశ్వరరెడ్డి సింగరేణిలోని అన్ని ఏరియాల జీఎంలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. సింగరేణిలోని ఏరియాల్లో 132/33 కేవీ, సబ్‌స్టేషన్ , 33 కేవీ, ఓహెచ్‌టీ లైన్, 33/6.6 కేవీ, 33/3.3 కేవీ సబ్‌స్టేషన్లకు సంబంధించి వాటి పనితీరు మరమ్మతులు, నూతన లైన్ల ఏర్పాటు, భూగర్భ గనులకు సంబంధించి సబ్‌స్టేషన్ల పనితీరు, ఉపరితల గనులకు సంబంధించిన ఎలక్ట్రికల్ నిర్వహణ, సీహెచ్‌పీల్లోని ఎలక్ట్రికల్ సంబంధిత వివరాలను డైరెక్టర్లు అధికారులతో చర్చించారు. సమావేశంలో ఆర్జీ–1 ఏరియా జీఎం శ్రీనివాస్, అధికారులు రామ్మూర్తి,, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

గోదావరిఖనిటౌన్(రామగుండం): స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో పాలీసెట్‌– 2023 అభ్యర్థులకు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమాకాంత్ తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే విద్యార్థులు పాలీసెట్ ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఎస్సెస్సీ మెమో, స్టడీ సర్టిఫికెట్స్ (4 నుంచి 10వ తరగతి వరకు) కులం, ఆదాయం (1–1–2023 తరువాత) సర్టిఫికెట్లు, పదో తరగతి టీసీ, ఆధార్ కార్డు, ఈడబ్ల్యూ సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలు, ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఐలు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

గోదావరిఖనిటౌన్: ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 17,18 తేదీల్లో భువనగిరిలో నిర్వహించే రాష్ట్ర 3వ మహాసభల పోస్టర్‌ను గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శుక్రవారం న్యాయవాదులు ఆవిష్కరించారు. అధిక సంఖ్యలో న్యాయవాదులు హాజరై మహాసభలను విజయవంతం చేయాలని ఐలు నాయకులు కోరారు. కార్యక్రమంలో కేంద్ర మహిళా కార్యదర్శి సీహెచ్. శైలజ, మున్సిపల్ ఏరియా ఐలు అధ్యక్ష, ఉపాధ్యక్షులు గోషిక ప్రకాశ్, ఎరుకల ప్రదీప్, ప్రధానకార్యదర్శి ఆసంపల్లి రవీందర్, న్యాయవాదులు దూడపాక లింగస్వామి, రామ్‌టెంకి శ్రీనివాస్, సానం మురళి, ప్రసన్న, మహేందర్, సీహెచ్. శ్రీనివాస్, సౌమ్య, రేష్మ, షానవాజ్‌లు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు మంత్రులచే ఖమ్మంపల్లి వంతెన ప్రారంభం

మంథని: ముత్తారం మండలం ఖమ్మంపల్లి వద్ద మానేరు నదిపై రూ.50 కోట్లతో నిర్మించిన వంతెనను శనివారం రాష్ట్ర మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ ప్రారంభించనున్నారు. వీరితో పాటు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్మన్లు పుట్ట మధు, జక్కు శ్రీహర్షిణి, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత హాజరుకానున్నారు. జయశంకర్ భూపాలపల్లి– పెద్దపల్లి జిల్లాలను కలుపుతూ నిర్మించిన వంతెనతో రెండు జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. వంతెన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంథని ఎంపీపీ కొండ శంకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ కోరారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

సుల్తానాబాద్: ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికుల వేతన అలవెన్స్‌లపై జరుగుతున్న చర్చలు విజయవంతం చేయాలని ఎన్టీపీసీ జేఏసీకి సహకరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి సునీల్ విజ్ఞప్తి చేశారు. సుల్తానాబాద్ మండలకేంద్రంలో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంట్రాక్టర్లు సహకరించలేదనే సాకుతో ఎన్టీపీసీ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. దీనిని పొడిగిస్తూ కాలయాపన చేస్తే సమ్మెకు దారి తీస్తుందని దీనికి ఎన్టీపీసీ కాంట్రాక్టర్లు, యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వాటిపై అలవెన్సులు పెంచాల్సిన బాధ్యత ఎన్టీపీసీ యాజమాన్యంపై ఉందన్నారు. యాజమాన్యం అలవెన్సులు పెంచని పక్షంలో కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉండాలనీ ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులకు ఏఐటీయూసీ పిలుపునిస్తోందన్నారు. నగర అధ్యక్షుడు అబ్దుల్ కరీం, నగర కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

పనుల పరిశీలన

కమాన్‌పూర్: ఓసీపీ–1 ప్రభావిత గ్రామమైన కమాన్‌పూర్ మండలంలోని జూలపల్లి లో సింగరేణి నిధులతో చేపట్టిన రహదారి, వీధి దీ పాలు, ములకలపల్లిలోని ఇంకుడుగుంతల నిర్మా ణాలను శుక్రవారం ఓసీపీ–1 పీవో రాధాకృష్ణ పరిశీలించారు. పనుల్లో నాణ్యతతో పాటు వేగంగా పూ ర్తిచేయాలని ఆదేశించారు. పీవో వెంట ఓసీపీ–1 ప్రాజెక్టు ఇంజనీర్ శ్రీనివాస్, ఏరియా వర్క్‌షాపు డీ జీఎం రాం రెడ్డి, కిషన్ సే, పోలు రాజు, సమ్మయ్య ఉన్నారు.



ప్లాస్టిక్‌ను తరిమేద్దాం

ప్లాస్టిక్ బాటిళ్లతో భూతం బొమ్మ తయారు చేసి దాని వాడకంతో కలిగే నష్టాలను తెలియజేశారు పెద్దపల్లి మున్సిపల్ సిబ్బంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణప్రగతి కార్యక్రమం చేపట్టారు. చెత్తను సేకరించే ఆటోలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ బాటిళ్లతో తయారు చేసిన భూతాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి